ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల జిల్లా వార్తలు

3

ఆదివారం 1 సెప్టెంబరు 2024

పాత పింఛన్‌ను పునరుద్ధరించాలి 5లో..

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు 5లో..

ఇసుక కష్టాలు తీరేదెన్నడు..?

- ఆన్‌లైన్ బుకింగ్ లేక ఇసుక కొరత
- భవన నిర్మాణం రంగం కుదేలు..
- కార్మికులకు ఉపాధి కష్టాలు..
- ఉపాధి కోసం జిల్లా కేంద్రానికి వలస



ఇసుక లేక నిలిచిపోయిన ఇంటి నిర్మాణ పనులు

బెల్లంపల్లి, ఆగస్టు 31: బెల్లంపల్లి నియోజకవర్గంలోని పలు మండలాల్లో కొన్ని నెలలుగా ఇసుక కొరత ఏర్పడింది. దీంతో ఇండ్ల నిర్మాణాలు నిలిచిపోవడంతో భవన నిర్మాణ రంగం కుదేలైంది. ఇసుక దొరకక ఎక్కడ చూసినా అర్థాంతరంగా నిలిచిపోయిన ఇండ్ల నిర్మాణాలు అగుపిస్తున్నాయి. ఇసుక లేక ఇంటి నిర్మాణాలు ఆగిపోవ డంతో కూలీలకు ఉపాధి దొరకడం లేదు. ఇంటి నిర్మాణా లపై పలు రంగాలకు సంబంధించిన కార్మికులు ఉపాధి పొందుతున్నారు. జీవనోపాధి కోసం కార్మికులు ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు చేస్తున్నారు.

భవన నిర్మాణ రంగం కుదేలు

నియోజకవర్గంలోని తాండూర్, బెల్లంపల్లి, కాసిపేట మండలాలకు నెన్నెల మండలం ఖర్జీలోని ఇసుక రీచ్ నుంచి ఇసుక వస్తోంది. ఆన్‌లైన్ పద్ధతి ద్వారా ఇసుకను సంబంధిత మైనింగ్ శాఖ అధికారులు కేటాయిస్తారు. రోజు బెల్లంపల్లి మండలం, పట్టణానికి దాదాపు 200 ట్రిప్పులు, కాసిపేట, తాండూర్ మండలాలకు 50 ట్రిప్పుల చొప్పున ట్రాక్టర్ యజమానులు ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకున్న వారికి ఇసుక రీచ్ ద్వారా సరఫరా చేస్తారు. సంబంధిత ట్రాక్టర్ యజమానులు ఇంటి యజమానులకు, బిల్డర్లకు నిర్ధేశించిన ధరలలో ఇసుకను సరఫరా చేస్తుంటారు. ఖర్జీ ఇసుక రీచ్ వద్ద నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ఐదు పీట్ల ఎత్తులో నీటి నిల్వల కోసం వాగులో చెక్ డ్యాంను నిర్మించారు. ఇది సాధారణ ఎత్తు కంటే 5 ఫీట్ల ఎత్తులో నిర్మించడంతో చెక్ డ్యాం ముందు నీరు నిలుస్తుండడంతో ట్రాక్టర్లు నీటిలో దిగబడుతున్నాయి. దీంతో ట్రాక్టర్ యజమానులు ఇసుక సరఫరా చేయ లేకపోతున్నారు. సంబంధిత మైనింగ్ అధికారులకు ట్రాక్టర్ యజమానులు, భవన నిర్మాణ కార్మికులు చెక్ డ్యాంకు ముందు ఇసుక రీచ్‌కు వెళ్ళే దారిలో తాత్కాలికంగా రహదారి నిర్మిస్తే ఇసుక రవాణాకు ఆటంకం ఉండదని చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ లేక పో వడంతో ఇసుక సరఫరా చేయలేకపోతున్నారు. బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాల్లో 350కి పైగా ఇంటి నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. శ్రావణ మాసం ముహూర్తాలు ఉండడంతో ఇండ్లు నిర్మించే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఉపాధి కరువై వలస బాట

ఇసుక సరఫరా లేని కారణంగా నిర్మాణ రంగం కుదేల వడంతో ఇక్కడ పనిచేసే మేస్త్రీలు, కూలీలు మంచిర్యాల జిల్లా కేంద్రానికి పనుల కోసం రోజు వెళ్తున్నారు. కాంటా చౌరస్తా వద్ద రోజు ఉదయం ఉపాధి కోసం మంచిర్యా లకు వెళ్తున్న కూలీలే కనిపిస్తున్నారు. మరికొందరు మంచిర్యాలకు వెళ్లలేక వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. మంచిర్యాలకు కూలీ కోసం వెళితే ఆరు నెలలు వరుస గా పని చేస్తేనే పనులను కల్పిస్తామని మేస్త్రీలు చెబు తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. మంచిర్యాలకు వెళ్లి కూలీ పనులు చేస్తే రాను పోను చార్జీలతో గిట్టుబా టు కావడం లేదని పేర్కొంటున్నారు. సమస్య పరిష్కరిం చాలని భవన నిర్మాణ కార్మికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా పట్టించుకోవడం లేదని, ఇసుక సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి
రాంకుమార్, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు



ఇసుక కొరత కారణంగా రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్నాం. నిర్మాణ రంగానికి సం బంధించి మేస్త్రీలు, కూలీలు పనులు లేక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్ప డింది. పనులు లేకపోవడంతో కొందరు మంచిర్యాలకు వెళ్తున్నప్పటికీ గిట్టు బాటు కూలీ రావడం లేదు. చేసేదేం లేక పనులు లేక కొందరు దుర్భర జీవితాలు గడుపుతున్నారు. ఇసుక సమస్యను త్వరగా పరిష్క రించాలి.

వలస బాట పడుతున్నాం
శ్రీనివాస్, బెల్లంపల్లి



ఇసుక లేక ఇంటి నిర్మాణాలు జరగక పోవడంతో ఉపాధి కోసం మంచిర్యాల కు వెళ్లి పనులు చేయాల్సిన పరిస్థితి మేస్త్రీలు, కూలీలకు ఏర్పడుతుంది. పని కోసం ఉదయాన్నే చార్జీలు పెట్టుకుని మంచిర్యాలకు వెళ్లినప్పటికి పని దొరుకుతుందనే గ్యారంటీ లేదు. ఇసుక రీచ్ వద్ద అధికారులు రహదారిని ఏర్పాటు చేస్తే ట్రాక్టర్ యజమానులు ఇసుక సరఫరా చేస్తారు. దీంతో సమస్య పరిష్కారం అవుతుంది.

రేపటి ధర్నాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

జన్నారం, ఆగస్టు 31: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా, నిత్యావసర ధరలను నియంత్రించాలని ఈ నెల 2న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఖలిందర్‌అలీఖాన్ పేర్కొన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌ను నచ్చిన రాష్ట్రాలకు ఎక్కువ, వ్యతిరేకంగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ బడ్జెట్ కేటాయిస్తుందన్నారు. రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులందరికి వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రైతులు, ప్రజలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల కార్యదర్శి దాసరి తిరుపతి, నాయకులు పౌలు, మహేందర్‌రెడ్డి, విజయ్, రాజేశం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని దీక్ష



దీక్షలో పాల్గొన్న సీపీఐ నాయకులు

లక్షెట్టిపేటరూరల్, ఆగస్టు 31: లక్షెట్టిపేట మండలం దౌడపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో శనివారం గ్రామపంచాయతీ ఎదుట ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి మేదరి దేవవరం మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో 70 మంది విద్యార్థులు ఉన్నా సరిపడ ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. హెల్త్‌సెంటర్, పశువైద్యశాలలో మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలన్నారు. పలు కాలనీల్లో పారిశుధ్యం లోపించినా అధికారులు పట్టించుకోవడం లేదని, చౌకధరల దుకాణంలో సమయపాలన పాటించడం లేదన్నారు. నాయకులు కేతిరెడ్డి రమణారెడ్డి, దుర్గం దేవన్న, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా గడియారం శ్రీహరి

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 31: రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్‌గా టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఎన్నికయ్యారు. శనివారం పట్టణంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘం సన్నాహక సమావేశంలో ఆయనను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. గడియారం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ పిలుపు మేరకు ఆదివారం పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా జిల్లా కేంద్రంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన



డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న డీఈవో

దండేపల్లి, ఆగస్టు31: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందుతుందని డీఈవో యాదయ్య అన్నారు. శనివారం గుడిరేవులో ప్రాథమిక పాఠశాలలో విరాళాలతో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులను డీఈవో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బడిబాగులో నేను అనే కార్యక్రమంలో దాతల సహకారంతో సేకరించిన విరాళాలతో విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయ మన్నారు. విద్యార్థులు డిజిటల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాల న్నారు. వందశాతం హాజరుతో పాఠశాలకు వస్తున్న ముత్తినేని సహశ్రీ, బాలసాని శ్రీలాస్య అనే విద్యార్థి నులను అభినందించారు. ప్రధానోపాధ్యా యుడు బొలిశెట్టి బుచ్చన్న, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు కల్పన, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లక్షెట్టిపేటరూరల్, ఆగస్టు 31: లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని గురునానక్ ఫంక్షన్‌హాలులో ఆదివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ దిలీప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సరస్వతి విద్యాపీఠం రాష్ట్ర సంఘటన కార్యదర్శి

హాజీపూర్, ఆగస్టు 31 : రాంపూర్‌లోని విద్యారణ్య ఆవాస విదాలయంలో సరస్వతి విద్యాపీఠం రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పోటీలను సరస్వతి విద్యాపీఠం రాష్ట్ర సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సరస్వతి శిశుమందిర్‌లో విద్యతోపాటు క్రమశిక్షణ, సంస్కారం నేర్పిస్తారన్నారు. క్రీడల ద్వారా ఆరోగ్యం, ఉల్లాసం లభిస్తుందన్నారు. పోటీల్లో పాల్గొనడానికి దాదాపు 1500 మంది విద్యార్థులు హాజరు కాగా సౌకర్యాలు కల్పించామన్నారు. విద్యాపీఠం మంచిర్యాల విభాగ్ అధ్యక్షుడు డాక్టర్ విష్ణువర్ధన్ రావు, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, నాయకులు సీతారాములు, గోవిందరావు, కృష్ణమాచార్యులు, భీమ్‌సేన్, రామన్న పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 31: వర్షాకాలంలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రాజేశ్వరితో కలిసి సందర్శించారు. రిజిష్టర్‌లను, రికార్డులను, వంటశాల, ఆహార సామగ్రిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.

కుట్టు మిషన్ల పంపిణీ

కాసిపేట, ఆగస్టు 31: దేవాపూర్‌లోని రెండు గిరిజన కుటుంబాలకు శనివారం ఎల్‌సీఐఎఫ్ జిల్లా కో ఆర్డినేటర్ గొంది వెంకరటమణ కుట్టు మిషన్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడు అన్ని రంగాల్లో ముందుంటారని తెలిపారు. మహిళలు కుట్టుమిషన్‌లను సద్వినియోగం చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం దూర ప్రాంతాల నుంచి చదువుకోవడానికి దేవాపూర్ ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న ఇద్దరు విద్యార్థులకు రెండు సైకిళ్లను అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు గొంది లక్ష్మీప్రసన్న, మడావి విజయలక్ష్మీ, సునీతాదేవి, హూస్కూరి విక్రమ్‌రావు, రాజేంద్ర ప్రసాద్, సాయికుమార్, వెంకటేష్, భూమయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో ఉప ముఖ్యమంత్రి పర్యటన రద్దు



పర్యటన రద్దు కావడంతో వెళ్లిపోతున్న ప్రజలు, కార్యకర్తలు

చెన్నూరు, ఆగస్టు 31: ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటన శనివారం చివరి నిమిషంలో రద్దయింది. శివలింగాపూర్ వద్ద 11 మెగావాట్ల సోలార్ విద్యుత్ పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన వస్తారని ఏర్పాట్లు చేశారు. రూ.67 కోట్లతో నిర్మించిన పవర్‌ప్లాంటు ప్రారంభాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ నాయకులు నాలుగు రోజులుగా సన్నద్ధం చేశారు. సింగరేణి ఉన్నతాధికారులు సైతం ఉపముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. పవర్ ప్లాంట్ ప్రారంభం తర్వాత బహిరంగ సభ నిర్వహించేందుకు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణలు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రతీ గ్రామం నుంచి 200 మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గోదావరిఖని వరకు వచ్చిన ఉపముఖ్యమంత్రి చెన్నూరుకు రానున్నారని సమాచారంతో బహిరంగ సభకు వేలాది మంది తరలి వచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సభ ప్రాంగణంలో వేచి చూస్తుండగా చివరి నిమిషంలో రద్దు అయినట్లు వార్త అందడంతో ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్లిపోయారు.

ఖర్చులు వృథా

ఉపముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించి సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో లక్షల రూపాయలను ఖర్చుచేశారు. షామియానాల ఏర్పాట్లు, శిలాఫలకాలు, రహదారుల పరిశుభ్రం, బహిరంగ సభ ఏర్పాట్లు, విద్యుత్ తదితర సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమం రద్దు కావడంతో ఏర్పాట్లకు వెచ్చించిన నిధులు వృథాగా మారాయి.

అనివార్య కారణాల వల్ల రద్దు

వాతావరణ పరిస్థితులు, కొన్ని అనివార్య కారణాల వల్ల రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెన్నూరు పర్యటన రద్దు అయినట్లు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి పేర్కొన్నారు. శనివారం రాత్రి ఎం ఆర్‌ఆర్ గార్డెన్‌లో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లా డారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హెలీకాప్టర్‌లో రావాల్సి ఉండగా వాతావరణం అనుకూలించకపోవడంతో రోడ్డు మార్గం గుండా వచ్చారన్నారు. దీంతో షెడ్యూల్‌లో మార్పులు జరిగాయన్నారు. రుణమాఫీ పడని రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చెన్నూరు, కోటపల్లి మండలాల్లో విష జ్వరాలు ప్రబలుతున్న దృష్ట్యా అయా మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధిర , మంచిర్యాల రెండు సమానమే..



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

ఏసీసీ, ఆగస్టు 31: మధిర నియోజకవర్గమైనా, మంచిర్యాల నియోజకవర్గమైనా రెండు సమానమేనని డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం రామగుండం పర్యటనకు వచ్చిన సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నేతృత్వంలో నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లి డిప్యూటీ సీఎం, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లకు ఘన స్వాగతం పలికారు. మంచిర్యాల నియోజకవర్గ కార్యకర్తలనుద్దేశించిన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తాను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పాదయాత్ర మొదలుపెట్టినప్పటి నుంచి ప్రేంసాగర్‌రావు అండగా ఉన్నారన్నారు. మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన కలెక్టర్



మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 31: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లను శనివారం రామగుండంలోని ఇల్లందు అతిథి గృహంలో కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి పూలమొక్కలను అందజేశారు.

జిల్లాలో మోస్తరు వర్షం

- ఎల్లంపల్లి గేట్లు ఎత్తే అవకాశం

మంచిర్యాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో జిల్లాలో శనివారం పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో 3.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కోటపల్లి మండలంలో అత్యధికంగా 16.6 మిల్లీమీటర్లు కురవగా జైపూర్ మండలంలో 6.2, తాండూరు 5.6, చెన్నూరు 5.4, నెన్నెల 4.2, వేమనపల్లి 2.9, మంచిర్యాలలో 2.8, నస్పూర్ 2.4, కన్నెపల్లి 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి కడెం ప్రాజెక్టు నుంచి 4003 క్యూసెక్కులు, వర్షాల కారణంగా 10,299 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వ 148.00 మీటర్లుకాగా ప్రస్తుతం 147.22కు చేరుకుంది. సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను 18.008 టీఎంసీలు ఉంది. ప్రాజెక్టు నుంచి 6580 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉండగా, హైద్రాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ వర్క్స్‌కు 280 క్యూసెక్కులు, నంది పంప్ హౌజ్‌కు 6300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి శనివారం 27 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. అవి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు చేరుతున్నందున ఆదివారం తెల్లవారుజామున ఎల్లంపల్లి గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలే అవకాశం ఉందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్వామి పేర్కొన్నారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

మంచిర్యాల కలెక్టరేట్: భారీవర్షాల దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న 2, 3 రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని, జిల్లాకు ఎల్లో అలర్ట్ ఉందని తెలిపారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 08736- 250501లో సంప్రదించవచ్చన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం జరగాలి



అధికారులకు సూచనలు ఇస్తున్న డీపీవో

కోటపల్లి, ఆగస్టు 31: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం జరగాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం కోటపల్లి, శెట్‌పల్లి, మల్లంపేట గ్రామాల్లో పర్యటించి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామాల్లో ప్లాస్టిక్, చెత్తాచెదారం కనబడకుండా ఉండాలని, అలసత్వం, నిర్లక్ష్యం వహించరాదన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విష జ్వరాలు ప్రబలుతున్నందున పరిసరాల్లో బయో లార్వా ఫాగింగ్ స్ప్రే చేయాలన్నారు. డ్రింకింగ్ వాటర్ శానిటేషన్‌కు సంబంధించి రిజిష్టర్‌లను అప్‌డేట్ చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్లతో మాట్లాడుతూ పం చాయతీల ఎన్నికల దృష్ట్యా అందరు సం సిద్ధంగా ఉండాలని, వార్డుల విభజన, ఓటర్ల జాబితా తయారీలో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం శెట్‌పల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడిన ఆయన పాఠ్యాంశాలను చదివించారు.

-మద్యం దుకాణానికి జరిమానా

కోటపల్లి మద్యం దుకాణం పరిసరాల్లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, చెత్తాచెదారం ఉండడంతో డీపీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశిస్తూ మద్యం దుకాణానికి రూ.5 వేల జరిమానా వేశారు. ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి నిరోష

ఏసీసీ, ఆగస్టు 31: మంచిర్యాల కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో జూనియర్ సివిల్ జడ్జిలు ఉపనిషద్వానీ, నిరోషలు మాట్లాడుతూ మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలు, లైంగిక వేధింపులు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల్లో చట్టాలు కల్పిస్తున్న రక్షణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవస్థల గురించి వివరించారు. వివిధ మహిళ చట్టాలపై దిశ నిర్ధేశం చేశారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళ ఉద్యోగుల పట్ల చూపుతున్న లింగ వివక్షత నివారణకు చట్టపరి ధిలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. మహిళలకు ఏదైనా సమస్యలుంటే న్యాయ సేవ సంస్థను సంప్రదిస్తే న్యాయ సలహాలు, సహకారం అందిస్తామన్నారు. మహిళల చట్టాలు, వారికున్న రక్షణపై అవగాహన పెంపొం దించేందుకు సదస్సులు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు సంఘం సేవకురాలు, లయన్స్‌క్లబ్ సభ్యురాలు శాంకరి, సువర్ణలు అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరుద్యోగ ఫోరం నేత అరెస్టు

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 31: ఉపముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క జిల్లా పర్యటన సందర్భంగా తాండూర్ మండలానికి చెందిన తెలంగాణ నిరుద్యోగ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుముల శ్రీకృష్ణదేవరాయలును తాండూర్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కృష్ణదేవరా యలు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ఉప ముఖ్యమంత్రికి నిరుద్యోగుల సమస్య లను విన్నవించడానికి వెళ్లకుండా పోలీసులు అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిత్యావసరాలు అందజేత

తిర్యాణి, ఆగస్టు 31: తిర్యాణి మండలం తలండి గ్రామ పంచాయతీలోని కోయతలండి గ్రామంలో శుక్రవారం రాత్రి కురిసినవర్షానికి ఆత్రం గోపాల్ అనే వ్యక్తి ఇల్లు కూలిపోవడంతో శనివారం పోలీసులు బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేశారు. ఇల్లు కూలిన సమయంలో ఎవరు లేక పోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ఎస్సై మాధవ్‌గౌడ్ శనివారం సం ఘటన స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు బియ్యం, నిత్యావసర సరుకులు అంద జేశారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శంకర్, గ్రామస్థులు గంగారాం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దండేపల్లి, ఆగస్టు 31: లింగాపూర్ చెందిన సోగాల శ్రీనివాస్ అనే ప్రైవేటు ఎలక్ట్రిషియన్ ఇటీవలే విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మృతుడు శ్రీనివాస్ కుటుంబా నికి స్నేహితులు, గ్రా మస్థులు సేకరించిన రూ. 30వేల ఆర్థిక సాయంను శనివారం కుటుంబసభ్యులకు అందజే శారు. సుభాష్, గూడ లక్ష్మణ్, జమీర్, కొమురయ్య, స్వామి, ఇమామ్, కాంతరావు, రాములు పాల్గొన్నారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

మల్యాల, ఆగస్టు 31: దిగువ కొండగట్టులో శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు చేశారు. ఈ మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష ఇతర సిబ్బంది టిఫిన్ సెంటర్లు, హోటళ్లను పరిశీలించారు. కొన్ని హోటళ్లలో కుళ్లిన వస్తువులు, కాలం చెల్లిన తిండి పదార్థాలను గుర్తించి వాటిని పడేశారు. గతంలో తనిఖీల సమ యం లోనూ పాడైన వస్తువులు లభించగా తీరు మారకపోవడంతో నిర్వహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లకు లైసె న్సులు తీసుకోవాలని సూచించారు.

ఇద్దరు డీజే నిర్వాహకులపై కేసు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 31: ఎలాంటి అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసి అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద, వెంకంపేట వద్ద రోడ్లపై డీజేలు పెట్టుకొని ప్రజ లకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న డీజే యజమానులైన పి పవన్‌కుమార్, గోలి రాజేందర్‌పై వేర్వేరుగా కేసు నమోదు చేశా మన్నారు. రెండు డీజేలను సీజ్‌చేశామన్నారు. డీజే యజమానులను అరెస్ట్‌చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. జిల్లాలో డీజే యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చామని , అయినప్పటికీ పోలీసుల సూ చనలు బేఖాతరు చేయడం వల్ల కఠినచర్యలు తీసుకుంటున్నామన్నారు. గణేశ్ మండపాల వద్ద పోలీసు అధికారుల అనుమతితో చిన్న స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతీ రోజు రాత్రి 10గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. డీజేల వలన చిన్నపిల్లలు, విద్యార్థుల చదువునకు , వృద్ధుల ఆరోగ్యానికి ఇబ్బందులు ఎదురవు తున్నాయని డయల్ 100కు కాల్స్ రావడంతో వెంటనే చర్యలు తీసుకుం టున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటుచేసినా, యాంప్లిఫైయర్‌తో బాక్స్‌లు ఏర్పాటుచేసినా కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు.

గంజాయి విక్రయం కేసులో నలుగురి అరెస్ట్

రామకృష్ణాపూర్, ఆగస్టు 31: రామకృష్ణాపూర్‌లో గంజాయి విక్రయి స్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ ఇన్స్పెక్టర్ జి రాజశేఖర్ తెలిపారు. కనకదుర్గ కాలనీలోని పాత బీ టైపు క్వార్టర్స్‌లో నలుగురు వ్యక్తులు గంజాయి తాగుతున్నార నే సమాచారం మేరకు తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న కవర్‌లో 355 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో అంతర్గాంకు చెందిన కొలి పాక అరవిందరెడ్డి, జాడి కిరణ్, ఆదిల్‌పేట్‌కు చెందిన వేల్పుల రాకేష్, రామకృష్ణాపూర్‌కు చెందిన మహమ్మద్ షఫీలు ఉన్నారని అన్నారు. వారిని విచారించగా కొంత కాలంగా మద్యానికి బానిసై డబ్బు ల కోసం గంజాయిని విక్రయిస్తున్నట్లు తెలిపారని చెప్పారు. నిందితులను పట్టుకున్న సిబ్బందిని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అభినందించారు.

అనారోగ్యంతో అప్పులపాలై ఒకరి ఆత్మహత్య



రవి(ఫైల్)

దండేపల్లి, ఆగస్టు 31: దండేపల్లి మండలం గూడెం చెందిన గోపతి రవి(42) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడు తున్నాడు. వ్యవసాయం తోపాటు హమాలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషంచేవాడు. కడుపునొప్పితో బాధపడుతూ పలు ఆస పత్రుల చుట్టూ తిరిగినా నయం కాలేదు. వైద్యం కోసం అప్పు చేశాడు. అప్పులపాలైన ఆరోగ్యం నయంకాలేదని, జీవితంపై విరక్తి చెందిన రవి శనివారం ఉదయం చేను వద్ద వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి భార్యకు చెప్పాడు. కుటుంబసభ్యులు లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు పేర్కొ న్నారు. మృతుడికి భార్య సుమలత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కాసిపేట, ఆగస్టు 31 : తుంగగూడెంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడు మేకల శశిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మా ట్లాడుతూ గత నెల 25న తుంగగూడెంలో మేకల పద్మ ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 9 వేల నగదును దొంగతనం చేశాడు. బాధి తురాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కొండా పూర్‌యావ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా మేకల శశి పారిపో యేందుకు ప్రయత్నించగా పట్టుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 31: గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తిని శనివారం అరెస్టు చేసినట్లు తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలి పారు. బీహార్‌కు చెందిన భటేశ్వర్‌రాయ్ తాండూర్ మండలంలోని బోయ పల్లిలో నివాసం ఉంటూ జాతీయ రహదారి పక్కన దాబా నిర్వహిస్తున్నాడు. ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలు పెంచుతు న్నట్లు సమాచారం అందడంతో శనివారం తనిఖీలు చేయగా అతని వద్ద నుంచి ఒక గంజాయి మొక్క, 44 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు అతడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, ఆగస్టు 31: బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఎమ్మెల్యే గడ్డం వినోద్ వినతి పత్రం అందించారు. పట్టణంలో తాగునీటి సమస్య ఏర్పడుతుందని, త్వరగా గోదావరి రక్షిత నీటి పథకానికి నిధులు మంజూరు చేసి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 31: జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కడకుంట్ల శ్రీనివాస్ పదవీ విరమణ పొందగా శనివారం ఆయనను సన్మానించారు. కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి కటకం అంజయ్య, తోటి ఉద్యోగులు శ్రీనివాస్‌ను సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ లక్ష్మణ్‌రావ్, శంకర్, అంజయ్య, స్వరూప, నాగచందర్ రావు, శోభ, శ్రీనివాస్ రావు, రాజయ్య, శ్రీనివాస్, డీఐఈవో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో రిజర్వేషన్లే లక్ష్యంగా పోరాడుతాం



మాట్లాడుతున్న పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 31: చట్టసభల్లో రిజర్వేషన్లే లక్ష్యంగా పోరాటాలు కొనసాగిస్తామని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమ్మర్తపు మురళి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు సాధించేందుకు పద్మశాలి సమాజాన్ని చైతన్యం చేయాలని కోరారు. చేనేత కార్మికులు పొదుపు చేసిన సొమ్ము ప్రభుత్వం తమ వాటా సొమ్మును విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. బొమ్మ రఘురాం, జెల్ల నరేందర్, హరిహర కిషన్, గాదాసు బాపు, వేముల వీరస్వామి, రామ్ సత్తయ్య, నీల శ్రీనివాస్, గడ్డం సుధాకర్, సదానందం, పాల్గొన్నారు.

న్యాయ అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న లీగల్ ఎయిడ్ కౌన్సిల్, స్వచ్ఛంద సంస్థల సభ్యులు

ఏసీసీ, ఆగస్టు 31: జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు ఎండీ సంధాని, ఆర్.రాములు నేతృత్వంలో న్యాయ అవగాహన సదస్సును పట్టణంలోని ఓ ప్రైవేటు హాలులో శనివారం నిర్వహించారు. సంగ్రామ్ సంస్థ ప్రతినిధి సంతోషి, దిశ ప్రోగ్రాం నీలిమ, సఖి సెంటర్ ఇన్‌చార్జి, మాతృఛాయ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. మాతృఛాయ ఫౌండేషన్ ప్రెసిడెంట్ నీతునాంపెల్లి, సెక్రటరీ రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగేష్, సాయి, అరుణ పాల్గొన్నారు.

పాత పింఛన్‌ను పునరుద్ధరించాలి



కోటపల్లి, బెల్లంపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

కోటపల్లి, ఆగస్టు 31: ప్రభుత్వం వెంటనే కాంట్రీబ్యూటరీ పింఛన్ స్కీంను రద్దు చేసి పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం పింఛన్ విద్రోహ దినం సందర్భంగా దేవులవాడ ఉన్నత పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలకు పైగా ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ఎలాంటి భరోసా ఇవ్వని సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రభుత్వ భాగస్వామ్య డబ్బును షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి దాని ద్వారా వచ్చే ప్రతిఫలాన్ని పింఛన్‌గా ఇవ్వడం అంటే గాలిలో దీపం వెలిగించడం లాంటిదన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బెల్లంపల్లి: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

భట్టి పర్యటన రద్దుకు వర్షాలే కారణమా?

మంచిర్యాల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా పర్యటన రద్దయినట్లు తెలుస్తోంది. ఖమ్మం, మధిర పట్టణాల్లో వరదల నేపథ్యంలోనే భట్టి పర్యటన రద్దు చేసుకుని మధిరకు వెళ్లినట్లు కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. జిల్లా పర్యటన రద్దు వెనుక ఎమ్మెల్యేల మధ్య వివాదమే కారణమనే మరో ప్రచారం జోరుగా సాగుతోంది. ఉప ముఖ్యమంత్రి భట్టి శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో పర్య టన ముగించుకొని మధ్యాహ్న భోజన విరామం అనంతరం చెన్నూరు, జైపూర్ మండలాల్లో పర్యటించాల్సి ఉంది. చెన్నూరులో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 11 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభిం చాల్సి ఉంది. అనంతరం ఎస్టీపీపీ సందర్శించి 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ మూడో యూని ట్ స్థలాన్ని పరిశీలించాల్సి ఉంది. గోదావరిఖనిలో ఉప ముఖ్యమంత్రి కార్యక్రమం ఆలస్యం కావడంతో చెన్నూరు కాకుండా కేవలం జైపూర్ లోని ఎస్టీపీపీకి వెళ్లనున్నట్లు తెలియడంతో ఎమ్మెల్యే గడ్డం వివేకానంద, ఆయన తనయుడు, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అలకబూనినట్లు సమాచారం. భారీ ఎత్తున జనసమీకరణ, ఇతర ఏర్పాట్లు చేయడం, భట్టి పర్యటన రద్దు చేసు కోవడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు భట్టి రాక సందర్భంగా ఎస్టీపీపీ ముందు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై మంత్రుల సమక్షంలోనే వివేక్ అసహనం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రైవేటు ఆసుపత్రిలో యువకుడి మృతి

● ఆసుపత్రి ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన



రవితేజ (ఫైల్)

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 31: హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన దొనోజుల రవితేజ(22) హైదరాబాద్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. బుధవారం జ్వరం రాగా అక్కడ ఓ ఆర్ఎంపీతో ఇంజక్షన్ చేయించుకున్నాడు. ఇంజక్షన్ చేసిన భాగంలో గడ్డ కావడంతో పాటు ఎడమ కాలు వాపు వచ్చి నడిచేందుకు ఇబ్బంది ఏర్పడింది. రవితేజ శుక్రవారం వేంపల్లిలోని ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకువెళ్లగా ఐబీ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు మూత్రనాళం నుంచి రక్తం వస్తుందని శస్త్ర చికిత్స నిర్వహించారు. అయినా రక్తస్రావం ఆగకపోవడంతో పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌కు వెళ్లాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా శనివారం తెల్లవారుజామున రవితేజ మృతి చెందాడు. యువకుడి కుటుంబ సభ్యులు ఐబీ చౌరస్తాలో చికిత్స అందించిన ఆసుపత్రికి చేరుకొని మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. పట్టణ సీఐ బన్సీలాల్ కుటుంబ సభ్యులను సముదాయించే ప్రయత్నం చేశాడు. సుమారు 5 గంటలపాటు ఆందోళన చేపట్టిన మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకెళ్లారు. మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయలేదని సీఐ తెలిపారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

కోటపల్లి, ఆగస్టు 31 : మండల కేంద్రంలో శనివారం పీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పనకంటి కపిల్‌కుమార్ వృద్ధులకు దుప్పట్లు అందించారు. రాబోయే చలికాలం దృష్ట్యా నిరుపేద వృద్ధులకు దుప్పట్లు, బ్లాంకెట్లు అందించినట్లు తెలిపారు. గ్రామస్థులు మల్లయ్య, శ్యాంసుందర్, స్వామి, మల్లికార్జున్, రాజన్న, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ పురస్కారాలు అందుకున్న జిల్లా కళాకారులు



అవార్డు అందుకుంటున్న మురళి, శ్రీనివాస్

మందమర్రి టౌన్/శ్రీరాంపూర్, ఆగస్టు 31: పట్టణంలోని రెండో జోన్‌కు చెందిన కళాకారుడు దమ్మల శ్రీనివాస్ శుక్రవారం వరంగల్ జిల్లా తొర్రూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గద్దర్ అవార్డు అందుకున్నారు. గద్దర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో అవార్డుకు అందజేశారు. గద్దర్ కూతురు వెన్నెల, తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీ, ప్రొఫెసర్ ఖాసిం, జాతీయ సాహితీ పురస్కార అవార్డు గ్రహీత పసునూరి రవీందర్, దరువు అంజన్న, ఉస్మానియా దళిత స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు నలిగంటి శరత్, నిర్వాహకుడు గిద్దె రాంనర్సయ్య పాల్గొన్నారు.

దండేపల్లి: నెల్కివెంకటాపూర్ చెందిన ముల్కల మురళి గద్దర్ అవార్డు అందుకున్నారు. మురళి మాట్లాడుతూ వాగ్గేయకారుడిగా గద్దర్ పురస్కారం అందించినందుకు గిద్దె గళం సంస్థ అధ్యక్షుడు రామనరసయ్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 31: మండల వ్యవసాయాధికారిగా పని చేసిన ఖాదర్‌హుస్సేన్ బదిలీపై కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు బదిలీపై వెళ్తుండడంతో శనివారం జన్కాపూర్ రైతు వేదికలో పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్ అహ్మద్, సిబ్బంది, ఫర్టిలైజర్ యజమానులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏవో మిలింద్‌కుమార్, ఏడీఏ కృష్ణారెడ్డి, ఏఈఓలు చిరంజీవి, రాము, స్రవంతి, వెంకటేష్, రాము, రహెమాన్, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు నాందేవ్,ఖాలీద్, గిరీష్, సతీష్, ఆశీష్, ముబీన్, వసంత్, నారాయణ, రమేష్, శ్రీనివాస్, పోశన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు



కోటపల్లి, ఆగస్టు 31: ఎసన్‌వాయి అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేయడంతో గర్భిణులు ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులకు, గర్భిణీలకు కేంద్రం నుంచి కోడిగుడ్లు పంపిణీ చేయగా ఇంటికి తీసుకెళ్ళి ఉడకపెట్టగా కుళ్లిపోయి ఉన్నాయి. దీనిపై అంగన్‌వాడీ సిబ్బందిని గ్రామస్థులు నిలదీయగా తమకేం సంబంధం లేదని, కాంట్రాక్టర్ పంపిణీ చేశాడని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లనే అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన కోడిగుడ్లు వచ్చాయని గ్రామస్థులు పేర్కొనగా అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే ఇది జరుగుతుందని, గత నెల రోజుల క్రితం పిన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో ఇలాంటి పరిస్థితి ఎదురు కాగా తాజాగా ఎసన్‌వాయి అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లు రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

కాసిపేట, ఆగస్టు 31: జిల్లాస్థాయి పాఠశాలల ఫుట్‌బాల్ పోటీలకు కాసిపేట జిల్లా పరిషత్ పాఠశాల 7వ తరగతి విద్యార్థి బానోత్ విష్ణుకుమార్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సాంబమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు భుక్య రాజన్నలు శనివారం తెలిపారు. శుక్రవారం మందమర్రి మండలం బొక్కలగుట్టలోని హెవెన్ ఆఫ్ హోప్ పాఠశాలలో జిల్లాస్థాయి అండర్ 14 ఫుట్‌బాల్ పోటీల్లో విష్ణుకుమార్ ప్రతిభ కనబర్చినట్లు ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూప, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు బేస్‌లైన్ టెస్టులు నిర్వహించాలి

కాసిపేట, ఆగస్టు 31: వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి బేస్‌లైన్ టెస్టు నిర్వహించాలని మండల నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేష్ అన్నారు. శనివారం తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాలలను పరిశీలించారు. 9, 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను, ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు

మందమర్రిరూరల్, ఆగస్టు 31: చిర్రకుంటలో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు సుంకరి రాజేందర్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ నాయకులు డీవీ దీక్షితులు ఆరుముళ్ల పోశం మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి ముందుకు సాగుతుందన్నారు. పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. మండల ఇన్‌చార్జీ సంజీవరావు, అక్కల రమేష్, జనార్దన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మందమర్రిరూరల్, ఆగస్టు 31: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. శనివారం కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించారు. వంటగదిని పరిశీలించి గదిని పరిశుభ్రంగా ఉంచాలని, తాజా కూరగాయలతో ఆహారం చేయాలని సూచించారు. వర్షాలు పడుతున్నందున విద్యార్థినులు వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

ఓటరు జాబితా స్పష్టంగా రూపొందించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

కాగజ్‌నగర్, ఆగస్టు 31: స్థానిక సంస్థల కోసం ఓటరు జాబితాను స్పష్టంగా రూపొందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కాగజ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది రూపొందిస్తున్న శనివారం ఓటరు జాబితాను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలన్నారు. గతంలో ఉన్న ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించాలన్నారు. ఓటరు జాబితాలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీపీవో భిక్షపతి, అడిషనల్ పంచాయతీ అధికారి ఉమర్, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వంట గది, బోధన తీరును పరిశీలించారు. అలాగే సీజనల్ వ్యాధులైన జ్వరాలు విషయంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో వసతులపై శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలలో భవన నిర్మాణంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ అధికారులకు ఉపాధ్యాయులు నివేదికలు అందించాలని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



సిర్పూర్(టి)లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

సిర్పూర్(యు), ఆగస్టు 31:మండలంలోని సోయంగూడ సమీపంలో శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో జైనూర్ మండలం ఉషేగాం గ్రామానికి చెందిన మెస్రం నీలబాయికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రామకృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. మెస్రం నీలబాయి తన తల్లిదండ్రుల వద్దకు మండలంలోని సోయంగూడ వచ్చి తిరిగి తన స్వగ్రామమైన ఉషేగాంకు నడుచుకుంటూ వెళ్తున్నది. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. దీంతో నీలబాయికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. ఈఎంటీ ప్రశాంత్ కుమార్,పైలట్ దయకర్ ఆమెను జైనూర్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కారు ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఎస్సై రామకృష్ణారావు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఓటరు జాబితాను పూర్తి చేయాలి

సిర్పూర్(టి), ఆగస్టు 31: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ఈ నెల 2 తేదీ వరకు వార్డుల వారిగా ఓటరు జాబితాను పూర్తి చేయాలని డీఎల్‌పీఓ ఉమర్ హుస్సేన్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితాపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఒక్క ఓటరు కూడా తప్పకుండా నమోదు చేయాలన్నారు. ఈ నెల 6న పంచాయతీ నోటీసు బోర్డుపై జాబితాను ప్రచురించనున్నామని తెలిపారు. జాబితా పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే కార్యదర్శులే బాధ్యత వహించాలన్నారు. ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శులు తిరుపతి, తదితరులు ఉన్నారు.

కెరమెరి: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించాలని ఎంపీడీవో అంజద్ పాషా అన్నారు. మోడి, రింగన్‌ఘాట్, ధనోర, కొలాం కోటారి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓటు జాబితాను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. పూర్తి స్థాయిలో పరిశీలించాని చెప్పారు. ఆయన వెంట కార్యదర్శులు బొజ్జిరావు, అంబారావు, సతీష్, ప్రేంసాగర్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయల కల్పనకు కృషి

రెబ్బెన, ఆగస్టు 31: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తున్నట్టు అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. నంబాల అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పోషక ఆహారంపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు ఆట వస్తువులతో చదువులపై ఆసక్తి పెంచేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పలు రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంమోహన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 31: పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ సదయ్య అన్నారు. డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఆసిఫాబాద్ మండల పరిధిలోని ముస్లిం మత పెద్దలతో వినాయక చవతి, మిలాద్ ఉన్ నబి పండుగల దృష్ట్యా శాంతి సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు, పుకార్లు, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా పోస్టులు పెట్టే అవకాశం ఉందన్నారు. ప్రజలు వాటిని నమ్మవద్దని, సంయమనం పాటించాలని సూచించారు. ఇబ్బందులు తలెత్తితే వెంటనే 100కు డయల్ చేయాలని సూచించారు. సమావేశంలో సీఐ సతీష్, పీస్‌కమిటీ సభ్యులు, మత పెద్దలు నిసార్, రహెమాన్, సాబీర్, యాహియా, మన్సూర్,అబ్దుల్‌రాబ్, సలాం, అహ్మద్, స లీం, ఇమ్రాన్, కైజర్, హారుణ్, జాఫర్, సాదిక్, ఫైజల్, యుదాసిర్, ఆలం, హనన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వాంకిడి, ఆగస్టు 31: మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలల్లో శనివారం ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసు కళాజాతా బృందం సభ్యులు విద్యార్థులకు సైబర్ నేరాలపె అవగాహన కల్పించారు. ప్రమాదాలు, సైబర్ నేరాలు, మోసాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సైబర్‌క్రైం, బాల్య వివాహాలు, కుటుంబ నియంత్రణ చర్యలు, చదువు ప్రాముఖ్యత, యువత వ్యసనాల బారిన పడకూడదని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. దీని వల్ల రకవరీ చేసుకునే వీలు ఉంటుందని తెలిపారు. మహిళల భద్రత మొదలైన అంశాలపై పాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ

దహెగాం, ఆగస్టు 31: మండలంలోని కల్వాడ, హత్తిని, కమ్మర్‌పల్లి, గిరివెల్లి గ్రామాల్లో శనివారం వ్యవసాయాధికారులు రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించారు.. ఈ సంద ర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ మండలంలో మొత్తం మూడు బ్యాంకులకు సంబంధించి 375 మంది వివరాలు పొందు పర్చాల్సి ఉందన్నారు. మూడు రోజులుగా 122 మంది వివ రాలు సేకరించామని తెలిపారు. వారంరోజుల్లో అన్ని వివరాలు సేకరణ పూర్తవుతుందని తెలిపారు. సర్వేలో ఏఈఓలు ఆనంద్‌రావు, వంశీకృష్ణ, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

పొలాల పండుగకు పిల్లలను పంపించాలి

- కేజీబీవీ పాఠశాల ఎదుట పోషకుల ఆందోళన

కెరమెరి, ఆగస్టు 31: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ పిల్లలను పొలాల పండుగకు పంపించాలని చెప్పినా సిబ్బంది వినడం లేదని చెప్పారు. పాఠశాలలో ప్రత్యేకాధికారి లేక పోవడంతో అనుమతి లేనిది పంపించలేమని ఉపాధ్యాయులు తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కెరమెరి, ఆగస్టు 31: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

తిర్యాణి,ఆగస్టు 31: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై మాధవ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం క్రీడా సమాఖ్య కార్యదర్శి సాంబశివరావు ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలురకు జిల్లా జట్ల వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. అపంతనం మాట్లాడుతూ విద్యార్థుల లక్ష్యం కోసం క్రమశిక్షణతో చదువుకోవాలని, వ్యవనాల బారిన పడొద్దని సూచించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ క్రీడ అధికారి మీనారెడ్డి, పీడీ లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయుడు వంకర్, ఉపాధ్యాయుడు నరేందర్, పూర్వ విద్యార్థి గుణవంత రావు, వెంకటేష్, శ్రీనివాస్, సు భాష్, రవీందర్, మహాదు, ఆఫ్రీన్, పరమశివ తదితరులు పాల్గొన్నారు.

కోవ లక్ష్మిని పరామర్శించిన హరీష్‌రావు



ఎమ్మెల్యే కోవ లక్ష్మిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 31: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అస్వస్థతకు గురై యశోద ఆసుపత్రిలో చికిత్స పొందగా శనివారం మాజీమంత్రి హరీష్‌రావు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

జ్వరంతో విద్యార్థిని మృతి



ఐశ్వర్య(ఫైల్)

వాంకిడి, ఆగస్టు 31: మండలంలోని అఖిని గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని ఐశ్వర్య(17) జ్వరంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐశ్వర్య 15 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నది. చికత్స నిమిత్తం తల్లిదండ్రులు మంగళ, భీవ్‌సన్‌లు మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. వైద్యులు ఇచ్చిన మందులు తీసుకుంటున్నది. శుక్రవారం సాయంత్రం ఐశ్వర్య తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో ఆమెను మళ్లీ మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందింది.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కౌటాల, ఆగస్టు 31: తలోడి గ్రామంలో శనివారం రాత్రి విద్యుదాఘాతంతో బిట్టుపల్లి గంగయ్యకు చెందిన గేదె మృతి చెందింది. విద్యుత్ స్తంబానికి విద్యుత్ సరఫరా కావడంతో గేదె తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందిందని యజమాని గంగయ్య తెలిపాడు.

బాధిత కుటుంబానికి చేయూత

సిర్పూర్(టి), ఆగస్టు 31: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల కేంద్రంలోని న్యూకాలనీకి చెందిన ఉపాసి పెంటు ఇల్లు కూలి పోవడంతో శనివారం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి దుస్తులు, వంట సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సంతోష్, ఉపాధ్యక్షుడు నజీర్ అలీ, ప్రధాన కార్యదర్శి ధనుంజయ్, జమీల్, కబీర్ అహ్మద్, శ్రీధర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

దహెగాం(పెంచికలపేట), ఆగస్టు 31: పెంచికలపేట మండల కేంద్రంలో శనివారం బీజేపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకుసభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. బూత్ స్థాయిలో పెద్ద ఎత్తున సభ్యత్వం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి సమస్యల పరిష్కారానికి పాటుపడాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మధుకర్, సత్య నారాయణ, సమీప్, రాజేష్,మహేష్, నాగేష్, శ్రీనివాస్, శ్రీనివాస్, భుజంగరావు, ప్రభాకర్, నానయ్య, భాస్కర్, పురుషోత్తం, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పొలాల అమావాస్య సందడి

వాంకిడి, ఆగస్టు 31: మండల కేంద్రంలో శనివారం పొలాల అమవాస్య సందడి నెలకొంది. పొలాల అమావాస్య రోజున ఎద్దులను ఉదయమే కడిగి అలంకరించి సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పొలాల అమవాస్య పండుగకు రెండు రోజులు మాత్రమే ఉండడంతో నిత్యావసర సరకులతో పాటు ఎద్దుల అలంకరణ సామగ్రిని కొనుగోలు చేసేందుకు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి తరలి వచ్చారు.

సిర్పూర్(టి): పొలాల పండగ సందర్భంగా మండలంలో శనివారం నిర్వహించిన వార సంతలో సందడి నెలకొంది. సోమవారం పొలాల పండగ రోజున పశువులను రైతులు అందంగా అలంకరిస్తారు. దీంతో వ్యాపారులు పశువుల అలంకరణ వస్తువులు ఏర్పాటు చేయడంతో రైతులు కొనుగోళ్లు చేస్తున్నారు.



ఎద్దుల అలంకరణ సామగ్రి కొనుగోలు చేస్తున్న రైతులు



సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

ఆసిఫాబాద్, ఆగస్టు 31: సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. ఇద్దరు ఎస్సైలు ప్రకాష్ చంద్రమిస్త్రీ, ఎంరాములు పదవీ విరమణ పొందుతుండడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు సంఘం ఆధ్వర్యంలో శనివారం వారిని ఎస్పీ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే బ్యాచ్‌కు చెందిన ప్రకాష్ చంద్రమిస్త్రీ, రాములు 35 సంవత్సరాలుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పని చేశారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఇన్‌స్పెక్టర్ రాణప్రతాప్, పెద్దయ్య, అంజయ్య, విజయశంకర్‌రెడ్డి, ఏవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ఆసిఫాబాద్, ఆగస్టు 31: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయలో శనివారం అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో తరుచుగా ప్రమాదాలే జరిగే ప్రాంతాలను గుర్తించి సూచికా బోర్డులు, వేగ నియంత్రకలు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డుప్రమాదాల ద్వారా ఇప్పటి వరకు 38 మంది మరణించారని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెంట్ ధరించే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని యువతకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జాతీయ రహదారులపై కాలింగ్ బాక్సులు ఏర్పాటు చేయాలని, ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు చేర్చే విధంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవోలు లోకేశ్వరరావు, సురేష్ రవాణా శాఖ, మున్సిపల్ కమిషనర్లు, రోడ్డు రవాణా సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, రోడ్డు భవనాలు, పోలీసు రహదారి సంస్థ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఎక్సైజ్, రెవెన్యూసంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: వచ్చే మూడు రోజులు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో శనివారం టెలికాన్ఫరెన్స్‌లో తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎంపీవో, వ్యవసాయాధికారులు, ఇతర జిల్లా అధికారులతో మాట్లాడారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు, పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున వాగులు, వంతెన కల్వర్టుల వద్ద సిబ్బందిని నియమించి ప్రజలు అటువైపుగా వెళ్లకుండా పర్యవేక్షించాలన్నారు. చెరువులు, కాలువలు తెగి పోకుండా నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలు, లోత ట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తరలించాలని సూచించారు. అలాగే జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ వేణు తెలిపారు. అత్యవసర సమయాల్లో కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవోలు లోకేశ్వరరావు, సురేష్ డీఎంహెచ్‌వో తుకారాం, పంచాయతీ అధికారి భిక్షపతి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్, ఆగస్టు 31: ఆయా వార్డుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. కాగజ్‌నగర్ భట్టుపల్లి చౌరస్తాలో శనివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటిని తనిఖీ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ దొంగతనాలు జరుగకుండా ఉండేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. కాలనీలో ఎవరైనా అనుమానస్పదంగా తిరుగుతుంటే తమకు సమాచారం అందించాలన్నారు. యువత వ్యసనాల బారిన పడకుండా చదువుపై దృష్టి సారించాలని చెప్పారు. పోలీసులు ప్రజల కోసం పని చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో సీఐ శంకరయ్య ఎస్సైలు పాల్గొన్నారు.

అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్టు

ఆసిఫాబాద్, ఆగస్టు 31: జిల్లాలో అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారి జాబితా సిద్ధం చేశామని, వారిపై పీడీ యాక్టు నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ కబ్జాలు, భూమి ఆక్రమించి యజమానులను బెదిరించేవారు, లైసెన్సులు లేకుండా వడ్డీలకు, ఫైనాన్షియల్ చిట్టీలు నడుపుతున్న వారిని గుర్తించామని చెప్పారు. చైన్ మార్కెటింగ్ పేరుతో డబ్బులు వసూలు చేసిన తరువాత సంస్థ ఎత్తేసిన వారు, ఆన్‌లైన్ ద్వారా రెట్టింపు డబ్బులు ఇస్తామని మోసం చేసి వారు,అక్రమ పశువులు తరలించే వారి జాబితా సిద్ధం చేసినట్లు తెలిపారు. వారిపై పీడీ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100 లేదా 8712670505కి సమాచారం అందించాలని కోరారు.

ఆదాయం ఉన్నా.. సౌకర్యాలు కరువు



బురదలో కూరగాయల విక్రయం

- వారసంతల్లో కనిపించని కనీస సదుపాయాలు
- గద్దెలు లేక వ్యాపారుల ఇబ్బందులు
- వర్షం వస్తే బురదతో తీవ్ర అవస్థలు
- కొనుగోలుదారులకు తప్పనితిప్పలు
- పట్టించుకోని అధికారులు, పాలకవర్గాలు

వారసంతలను నిర్వహించే పాలకవర్గాలు వాటి ద్వారా ఆదాయం సమకూరినప్పటికీ సౌకర్యాల కల్పనపై మాత్రం దృష్టి సారించడం లేదు. గూడారాలు, తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న షెడ్ల కిందనే వ్యా పారులు విక్రయాలు సాగిస్తున్నారు. వర్షం పడితే బురదమయంగా మారిన పరిసరాలతో వ్యాపారులు, కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు.

బెజ్జూరు, ఆగస్టు 31: గ్రామాల్లో నిర్వహించే వారసంతల్లో కనీస సౌకర్యాలు లేక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా వారసంతల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వర్షాకాలంలోనైతే ఇబ్బందులు చెప్పవలసినవి కావని ఆవేదన చెందుతున్నారు. భారీ వానలు కురిసిన సమయంలో సంతకు తీసుకవచ్చిన సరుకులు పూర్తిగా వర్షంలో తడిసిపోతున్నాయని, దీంతో నష్టం వాటిల్లుతోందని చెబుతున్నారు. గద్దెలు లేక వ్యాపారాలు నేలపైనే కొనసాగిస్తున్నారు. వర్షం కురిస్తే వారి కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సంతలో అమ్మకానికి తెచ్చిన వస్తువులు వర్షానికి పూర్తిగా తడిసి పాడైపోతోందని వాపోతున్నారు.

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎక్కువగా మారుమూల గ్రామాలు ఉండడం అందులో ఎక్కువగా పట్టణ ప్రాంతాలు లేకపోవడంతో ఎక్కువగా వారసంతల్లోనే ప్రజలు వివిధ రకాల సామగ్రిని కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే వారసంతల్లో కనీస సదుపాయాలు లేక క్రయవిక్రయ దారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా వారసంతల్లో కనీస సదుపాయాలు లేక వ్యాపారులు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

ఆదాయం పైనే దృష్టి..

మారుమూల గ్రామాల్లో నిర్వహించే వారసంతలకు పల్లెటూరి సూపర్ మార్కెట్లుగా పేరుంది. గ్రామాల్లో నిర్వహించే వారసంతల్లో గుండు సూది నుంచి అన్ని రకాల సామగ్రి అందుబాటులో ఉంటుంది. కూరగాయలు, బట్టలు, పిల్లల ఆటలాడే వస్తువులు, వివాహాలకు సంబంధిచిన సామగ్రితో పాటు అన్ని రకాల వస్తువులు ఒకే చోట లభ్యమవుతుంటాయి. ఈ క్రమంలో గ్రామాల్లో వారసంతలు నిర్వహించడానికి గ్రామపంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది. ఏడాదికి సంతలను బట్టి లక్షలు సమకూరుతున్నాయి. వారసంతలకు ఆదాయం లక్షల్లో ఉన్నా సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. దీంతో నేలపైనే కూర్చొని క్రయవిక్రయాలు చేస్తున్నామని వాపోతు న్నారు. గ్రామ పంచాయతీ ఆదాయం కోసం ప్రతి వారం వ్యాపారుల వద్ద నుంచి డబ్బులు తీసుకుంటున్నా వసతులు మాత్రం కల్పించడం లేదని వాపోతున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 15 మండలాలు ఉన్నాయి. ఇందులో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో పెద్దమొత్తంలో వారసంత కొనసాగుతోంది. ఈ సంతల్లో లక్షల్లో వ్యాపారాలు కొనసాగుతాయి. ఇక మిగితా మారుమూల మండలాల్లో సైతం ప్రతీ వారం ఏదో ఒక రోజున వివిధ గ్రామాల్లో వార సంతలు నిర్వహణ జరుగుతోంది. యేటా సంతల ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు సమకూ రుతున్నా సౌకర్యాలు మాత్రం ఏర్పాటు చేయడం లేదని ఆయా గ్రామాల్లోని వ్యాపారులు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో మాత్రం ప్రధాన రోడ్డుపైనే వార సంతలు కొనసాగుతున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. అయినా అధికారులు ఆదాయంపై మాత్రమే దృష్టి సారిస్తున్నారు తప్ప సదుపాయాలపై ఏ మాత్రం దృష్టి సారించకపోవడం గమనార్హం.

సౌకర్యాలు లేక ఇబ్బందులు..

కొట్రంగి విజయ, కూరగాయల వ్యాపారి, బెజ్జూరు



గ్రామాల్లో నిర్వహించే వారసంతల్లో సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో వర్షం వచ్చినప్పుడల్లా తీవ్ర అవస్థలు పడుతున్నాం. సంతలో కూరగాయాలు విక్రయించే మా నుంచి ప్రతీవారం ముక్కుపిండి మరీ రుసుం వసూలు చేస్తున్న అధికారులు మాకు అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోకపోవడం విచారకరం. వారసంతల ద్వారా వచ్చే ఆదాయంతో కనీస సౌకర్యాలు కల్పించాలి. జిల్లాలోని అన్ని వార సంతల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

రాజకీయ వాట లక్ష్యంగా పోరాటం

- పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 31:చట్ట సభల్లో రాజకీయ వాట లక్ష్యంగా పోరాడుతామని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళీ అన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని పద్మశాలి సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ 2028 సంవ్సరంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చట్ట సభల్లో రాజకీయ వాటను పద్మశాలి సమాజాన్ని చైతన్యవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కా ర్మికులు, అనుబంధ కార్మికులు పొదు పు చేసిన రెండు వేల మొ త్తానికి ప్రభుత్వం 4,000 జమ చేసే ప్రభుత్వ వాటా గత కొన్ని నెలలుగా పేరుకుపోయిన బకాయిలను విడుదల చేసినందుకు చేనేత వర్గాలలో ఆనందం వెల్లివిరిసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాతనే నేతన్న బీమాకు రూ.6 కోట్లు, బతుకమ్మ చీరలబకాయిలు రూ.150 కోట్లు, చేనేత సహకార సంఘాల బకాయిలు రూ.25 కోట్లు విడుదల చేసిందని చె ప్పారు. ఎల్ఐసీ నిబంధనల ప్రకారం ఐదు లక్షల బీమా వర్తించేందుకు త్వర లోనే విధి విధానాలు ఖరారు చేయనున్నట్లు తెలిపారు. దీంతో పద్మశాలి కులస్తులకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు సత్యం, రఘురాం, రమేష్, నరేందర్, కిషన్, రమేష్, ఆంజనేయులు, మల్లయ్య, రాజయ్య, వెంకటేశ్వర్లు, కనకయ్య, సత్యనారాయణ, రాజమౌళి, శంకర్, శ్రీనివాస్, ప్రణయ్, శ్రీకాంత్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీసు యాక్టు అమలు

ఆసిఫాబాద్, ఆగస్టు 31: శాంతిభద్రతల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణ పరిస్థితులను కొనసాగించడానికి సెప్టెంబరు 1 నుంచి 30 వరకు జిల్లా అంతటా 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నా, బహిరంగ సభలు తదితర ప్రజలు గుమికూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి వీలు లేదన్నారు. నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి గొలిపే ఎటువంటి ఆయుధాలు కలిగి ఉడొద్దని చెప్పారు. ప్రజా జనజీవనానికి ఇబ్బంది, చిరాకు కలిగించే స్పీకర్లు, డీజేలు వంటివి నిషేధమని ఎస్పీ తెలిపారు.

కాలనీల్లోకి వరదనీరు

- స్థానికుల ఇబ్బందులు
- ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో భారీ వర్షం
- చింతలమానేపల్లిలో ఉప్పొంగి ప్రవహిస్తున్న దిందా వాగు

ఆసిఫాబాద్, ఆగస్టు 31: జిల్లాలో శనివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలలో కురిసిన వర్షానికి కాలనీల్లో భారీగా వరదనీరు నిలిచింది. పలు ఇళ్లలోకి వరదనీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కుమరంభీం, వట్టివాగు ప్రాజెక్టుల లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు కుమరం భీం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి 1280 క్యూసెక్కులు, వట్టివాగు ప్రాజెక్టు ఒక గేటు ద్వారా 360 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతు న్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. బస్టాండుఏరియా, మార్కెట్‌ఏరియాతో పాటు లోతట్టు ప్రాంతాల కాలనీకి వరద నీరు వచ్చింది. ఎస్పీఎం కాలనీల్లో పలు ఇండ్లలోకి మురికి కాల్వల నీరు వచ్చింది. రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద వర్షం నీరుతో వాహనాలకు ఇబ్బంది కలిగింది. వీటితోపాటు మార్కెట్ ఏరియాలోని మురికికాల్వల్లో వర్షం నీరు నిండి పారింది. రైల్వే కాలనీ, బాలాజనగర్‌కాలనీతో పాటు తదితర కాలనీల్లో అంతర్గత రోడ్లపై వర్షం నీరు నిండి ప్రహించింది. కరెంటు సరఫరా నిలిచిపోవడంతో పట్టణ వాసులు ఇబ్బందులు పడ్డారు.

రెబ్బెన: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వర్షం కురిసింది. ఎన్టీఆర్ కాలనీలో రోడ్లపై నీరు పారుతూ ఇళ్లలోకి వచ్చింది. అలాగే పలు కాలనీల్లో కూడా మురికి కాల్వలు సక్రమంగా లేకపోవటంతో ఇళ్లలోకి వర్షం నీరు అధికంగా చేరింది.

చింతలమానేపల్లి: మండలంలో మోస్తరు వర్షం కురిసింది. దీం తో దిందా- కేతిని మధ్య ఉన్న వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి.



కాగజ్‌నగర్ ద్వారాకనగర్ కాలనీలో నిలిచిన వరదనీరు

వాంకిడి: మండలంలో శనివారం సాయంత్రం ఉరుముల మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఐదు గంటల నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్ని జలమయమయ్యాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఇళ్లలోకి చేరిన వరదనీరు



ఆసిఫాబాద్‌లో కురుస్తున్న వర్షం



రెబ్బెనలో నిలిచిన వర్షం నీరు



సమస్య పరిష్కరించకుంటే సమ్మె



నినాదాలు చేస్తున్న కార్మికులు

శ్రీరాంపూర్, ఆగస్టు 31 : కన్వేయన్స్ డ్రైవర్ల వేతన సమస్య పరిష్కరించుకుంటే సమ్మె తప్పదని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం(సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ అన్నారు. కన్వేయన్స్ డ్రైవర్లు శనివారం శ్రీరాంపూర్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపగా, మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి అందించే మొత్తం వేతనాన్ని కార్మికులకు చేరడం లేదన్నారు. ఏదైనా హక్కు గురించి ప్రశ్నిస్తే పని నుంచి తొలగిస్తున్నారని పేర్కొన్నారు. ఓనర్లకు ఎదురు చెప్పలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 11 తర్వాత సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిట్ కమిటీ అధ్యక్షుడు కాసిపేట రాజేశం, కన్వేయన్స్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు ఘన సన్మానం

శ్రీరాంపూర్, ఆగస్టు 31: శ్రీరాంపూర్‌లోని అన్ని గనులు, విభాగాలలో శనివారం రిటైర్ అయిన పలువురు ఉద్యోగులను అధికారులు, యూనియన్లు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్‌కే-6, ఆర్‌కే-7 గనులపై కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, పిట్ కార్యదర్శులు శ్రీనివాస్, శ్రీధర్, నాయకులు సందీప్, రవీందర్, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సీఎస్‌పీతో పాటు ఇతర గనుల్లో సన్మానాలు నిర్వహించారు. ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు, నాయకులు కలవేన శ్యామ్, గరిగె స్వామి, పిట్ కార్యదర్శి లతీష్, అరకాల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆర్‌కే-6 గనిపై వెంకట పుల్లారెడ్డి, అర్జయ్యలను మేనేజర్ తిరుపతి సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సంఘం సదానందం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్ఆర్‌పీ-1 గనిలో ఉద్యోగ విరమణ పొందిన వెంకటే శ్వర్ రావు, రాములు, సత్తయ్యలను ఇన్‌చార్జి మేనేజర్ నరేష్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి సాధన్, ఏఐటీయూసీ నాయకులు మోత్కూరి కొమురయ్య, దాడి రాజయ్య పాల్గొన్నారు. ఆర్‌కే-6 గనిలో పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వెంకట పుల్లారెడ్డిని నస్పూర్ రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. టీబీజీకే ఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఏఐటీయూసీ నాయకులు మౌనం వీడాలి'

కాసిపేట, ఆగస్టు 31: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గుర్తింపు పత్రం జారీలో ఏఐటీయూసీ మౌనం వీడాలని సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకట స్వామి అన్నారు. శనివారం కాసిపేట 2వ గనిలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం గని మేనేజర్ లక్ష్మీనా రాయణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి అల్లి రాజేందర్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సురేష్, నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా శివకృష్ణ



శివకృష్ణ

మందమర్రి టౌన్, ఆగస్టు 31: మందమర్రి ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా ఏరియాలోని కేకే 5 గనిలో సీనియర్ మైనింగ్ సర్దార్‌గా పని చేస్తున్న ఎస్ శివకృష్ణ నియమితులయ్యారు. దీంతో శనివారం పలువురు క్రీడాకారులు ఆయనను అభినందించారు.

సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 31: సింగరేణిలో తిరిగి కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని హెచ్ఎంఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కేంద్ర కమిటీ నాయకుడు వెల్ది సుదర్శన్‌లు డిమాండ్ చేశారు. శనివారం హెచ్ఎంఎస్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత సంవత్సరం కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించగా ఏఐటీయూసీ ఎన్నికైందని, కానీ ఇప్పటి వరకు యాజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వలేదన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం 45 రోజుల్లో గుర్తింపు పత్రం ఇవ్వకపోతే ఎన్నిక చెల్లిదన్నారు. ఎన్నికలు జరిగి ఎనిమిది నెలలు కావస్తున్న నేపథ్యంలో కార్మికులు పలు సమస్యలతో సతమత మవుతున్నారన్నారు. అలాగే కార్మికులకు 35 శాతం లాభాల వాటా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోశమల్లు, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సంక్షేమాధికారికి సన్మానం

శ్రీరాంపూర్, ఆగస్టు 31: ఆర్‌కే-6 సంక్షేమాధికారిగా పనిచేసి బదిలీపై కార్పొరేట్(ఎడ్యుకేషన్)కు వెళ్తున్న డిప్యూటీ పర్సనల్ మేనేజర్ కె. సునీల్ కుమార్‌ను గని ఉద్యోగులు, పలు కార్మిక సంఘాల నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ తిరుపతి మాటాడుతూ, సునీల్ కుమార్ ముందుండి గనిని సంక్షేమపథంలో నడిపించారని, కార్మికుల ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శంకర్ రావు, రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, పిట్ కార్యదర్శి సంఘం సదానందం, నాయకులు చిలుక రాంచందర్, తోట మహేష్, నగేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేస్తున్న అధికారికి సన్మానం

రెబ్బెన, ఆగస్టు 31: బెల్లంపల్లి ఏరియాలో డీజీఎం సెక్యూటీ అధికారిగా పని చేసి పదవీ విరమణ పొందుతున్న వరప్రసాద్‌ను శనివారం జీఎం శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న వర ప్రసాద్ సింగరేణికి అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, పీఓ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో క్లర్క్‌గా పని చేసి పదవీ విరమణ పొందుతున్న కుమార్‌ను ఏఐటీయూసీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిట్‌సెక్రటరీ మారం శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ ఎప్పటికీ మరిచి పోలేని ఘట్టమని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి నరేందర్, కాలరీ మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయం

రెబ్బెన, ఆగస్టు 31: సనాతన ధర్మ పరిరక్షణ కోసం విశ్వ హిందు పరిషత్ కృషి చేస్తోందని విశ్వ హిందు పరిషత్ జిల్లా అధ్యక్షులు రాజలింగు తెలిపారు. శనివారం రెబ్బెనలో ఏర్పాటు చేసిన మావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఖండ కమిటీ . అధ్యక్షుడిగా లోకేష్ నాయుడు, ఉపాధ్యక్షుడిగా కంచర్ల వేణుగోపాల్, కోశాధ్యక్షులుగా కీర్తి మహేందర్, కార్యదర్శి నర్సింహారాజ్, సహాకార్యదర్శి అంకం స్వామి, సహా కార్యదర్శులు తవ్విటి మనిష్, పిప్పరే బాలకృష్ణ, భజరంగ్ దళ్ సంయోజక్ సంజీవ్, సత్సంగ్ ప్రముఖ్ గస్ శ్యాం చౌడ, గోరక్షక్ సంయోజక్ మన్యం కిరణ్ ఎన్నుకున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా సహ కార్యదర్శి చౌహాన్ సంతోష్, తాండూరు ప్రఖండ కార్యదర్శి రామగిరి సతీష్ పాల్గొన్నారు.